క్లుప్తంగా

గౌరీదేవి అలంకరణ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా చక్రద్వారబంధంలోని దేవీచౌక్ వద్ద బుధవారం గౌరీదేవి అలంకరణ పోటీలు నిర్వహించారు. ఉత్తమ అలంకరణగా గుర్తించిన నాలుగు అలంకరణలకు గాది సూరిబాబు, వీరమణి దంపతుల సహకారంతో పసుపు, కుంకుమ భరిణిలను అందజేశారు. అలాగే ఆలయానికి పక్కనేన్న కొలనులో సాయంత్రం జగన్మాతకు తెప్పోత్సవం నిర్వహించారు.

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి



గ్రామసభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రంగంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సింగంపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ తుట్టా శివశంకర్ ఆనంద్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. 2024–25లో చేపట్టే పనులపై చర్చించారు. పథక ఏపీఓ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడాది కాలంలో చేపట్టిన పనులను వివరించారు. చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు, పుంత రోడ్లు, సోక్ పిట్స్, రింగ్‌ట్రెంచ్‌లు తదితర పనులతో పాటు, కొత్తగా 45 పనులను గుర్తించామని తెలిపారు. ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బన్న, ఉప సర్పంచ్ సోమిశెట్టి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ఎల్.త్రిమూర్తులు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో ట్రాఫిక్ ఆంక్షలు

గోకవరం: స్థానిక దేవీచౌక్ కనకదుర్గమ్మ ఊరేగింపును పురస్కరించుకుని గురువారం గ్రామంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ఎస్సై యువి శివ నాగబాబు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. ఆ సమయం నుంచి రాజమహేంద్రవరం, రంపచోడవరం మార్గంలో ప్రయాణించే వాహనాలను వీరలంకపల్లి, పెంటపల్లి, రంపయర్రంపాలెం, ఠాకూరుపాలెం, కొత్తపల్లి మీదుగా మళ్లిస్తామన్నారు. రాజమహేంద్రవరం నుంచి గోకవరం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు లారీ యూనియన్ కార్యాలయం వద్ద, రంపచోడవరం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తంటికొండ వెళ్లే ఆర్చి వద్ద, జగ్గంపేట వైపు నుంచి ఆర్టీసీ బస్సులను డ్రైవర్స్ కాలనీ వద్ద తాత్కాలికంగా నిలుపుదల చేస్తామన్నారు. ప్రయాణికులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కన్నులపండువగా కనకదుర్గమ్మ ఊరేగింపు



గోకవరం కనకదుర్గమ్మ ఊరేగింపులో గరగల నృత్యాలు, శక్తివేషాలు

గోకవరం: స్థానిక వీరభద్రునిగడ్డలో వెలసిన కనకదుర్గమ్మ ఊరేగింపు బుధవారం కన్నులపండువగా జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని పూల రథంపై ఊరేగించారు. ఊరేగింపులో గరగ నృత్యాలు, నవదుర్గ నృత్యాలు, చిన్నారుల కోలాటం, కేరళ డప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక ఆంజనేయ స్వామి గుడి సెంటర్ నుంచి ప్రధాన రహదారిపై పంచాయతీ కార్యాలయం వరకూ ఊరేగింపు జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు రామేశ్వరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం రామేశ్వరం గ్రామంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో ప్రసూతి, కంటి, చిన్నపిల్లల, ఫిజీషియన్, ఎముకల విభాగాల వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, మందులు పొందవచ్చన్నారు. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన శస్త్ర చికిత్సలు చేయిస్తారని తెలిపారు.

ఘనంగా వాసవీమాత ఊరేగింపు

మధురపూడి: కోరుకొండలో బుధవారం వాసవీ కన్యకా పరమేశ్వరి రథోత్సవం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

పుష్కలంగా సాగునీరు

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి 14 వేల ఎకరాలకు పంపిణీ



సీతానగరం వద్ద తొర్రిగడ్డ కాలువలో పుష్కలంగా సాగునీరు

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు పుష్కలంగా అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సాగునీటికి రైతులు తీవ్ర ఇబ్బంది పడేవారు. అరకొరగా విడుదలైన నీటితో పంటలు పండించుకోవడానికి అవస్థలు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీటి విడుదల పుష్కలంగా చేయడం ప్రారంభించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో స్కీమ్ నుంచి నెల రోజులు ముందుగానే సాగునీటిని విడుదల చేస్తున్నారు.

14 వేల ఎకరాల ఆయకట్టు

మండలంలో సుమారు 14 వేల ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్‌లో నీరందిస్తున్న తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌ను 1964లో నెలకొల్పారు. అయితే పాత స్కీమ్‌ను తొలగించి, తిరిగి కొత్త భవనంలో మూడు పంపుల ద్వారా 18 డిసెంబర్ 2003లో నీరందించడం ప్రారంభించారు. ప్రధాన కాలువ 3.925 కిలోమీటర్లు పొడవు, ఎడమ కాలువ 22 కిలోమీటర్లు, కుడి కాలువ 17 కిలోమీటర్లు కలిగి ఉన్నాయి. పురుషోత్తపట్నం నుంచి బొబ్బిల్లంక వరకు అధికారికంగా 13,482 ఎకరాలు ఉంది. దీనికి బడ్జెట్ నిధులు కేటాయిస్తున్నారు. ఈ స్కీమ్ మూడు మోటార్లు ఉండగా, అందులో ఒకటి స్టాండ్ బైగా ఉంటుంది. ఒక్కొక్క పంపు 120 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుంది. ప్రతి రోజూ రెండు పంపుల ద్వారా 240 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

నెల రోజుల ముందుగానే..

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో నెల రోజుల ముందుగానే సాగునీరు అందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఏడాదీ జూలై ఆఖరి వారంలో నీరు వదిలేవారు. రెండో పంటకు రైతుల నుంచి నగదు వసూలు చేసినా, సక్రమంగా నీరును అందించేవారు కాదు. అయితే రెండేళ్ల నుంచి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, జూన్ మొదటి వారంలో సాగునీరు పుష్కలంగా అందిస్తున్నారు. రెండవ పంట మొక్కజొన్నకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తున్నారు. దీనితో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా వరిపంట

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఖరీఫ్, రబీ పంటలకు టీపీ స్కీమ్ నుంచి పుష్కలంగా నీరు అందిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన వరిపంట ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీనితో రైతులు మంచి ఆనందంగా ఉన్నారనే చెప్పవచ్చు.

పండగలా వ్యవసాయం



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో సాగునీరు పుష్కలంగా అందుతోంది. దీనితో పంటలను ధీమాగా పండించుకుంటున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధర అందిస్తోంది. జగన్ పాలనలో వ్యవసాయం పండగలా మారింది.

– కొరవటి చింతయ్యకాపు, కౌలురైతు, వంగలపూడి

సాగునీటి ఇబ్బందులు లేవు



ఖరీఫ్ పంటకు నెల రోజుల ముందు నుంచే సాగునీరు అందిస్తున్నారు. ఆకుమడులకు స్కీమ్ నుంచి వచ్చిన నీటినే ఉపయోగించాం. టీడీపీ ప్రభుత్వంలో నీరు సక్రమంగా ఇచ్చేవారు కాదు. ఇప్పుడు సాగునీటికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేవు. ఖరీఫ్‌తో పాటు రబీలో వేసే ఆరుతడి పంటలకు చక్కగా నీరు అందుతోంది.

– తోరం శోభనబాబు, రైతు, లంకూరు

పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష



తొస్సిపూడిలో రోగికి మందులు ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



తొస్సిపూడిలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తొస్సిపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కొందరికి వైద్య సేవలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది స్వల్ప ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేసి, ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష సేవలను అందిస్తున్నట్టు వివరించారు. ఇదే గ్రామంలో వెల్నెస్ సెంటర్ ప్రారంభించారని, ప్రజలు ఎప్పుడైనా వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జి.విజయలక్ష్మి, ,ఉప సర్పంచ్ వీరవెంకట రామారెడ్డి, ఎంపీటీసీ తేమ సుమ, మాజీ సర్పంచ్‌లు జగ్గిరెడ్డి, సుబ్బారావు, సచివాలయ కన్వీనర్ సుజాత, పంచాయతీ వార్డు సభ్యులు జాస్తి, మురళి తదితరులు పాల్గొన్నారు.



బొల్లెద్దుపాలెంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

బొల్లెద్దుపాలెంలో..

మధురపూడి: కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 503 మంది రోగులకు వైద్యపరీక్షలు చేశారు. డాక్టర్లు కోటేశ్వరరావు, శ్రీవల్లీ, మౌనిక, లాస్య, జోతిర్మయి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, సెక్రటరీ జి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. పెదపూడి సచివాలయలం–2లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ప్రజలు డబ్బును వృథా చేసుకోకుండా, ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌కు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో కోటి 40 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు. గ్రామాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. శిబిరంలో మొత్తం 354 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్, సర్పంచ్ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, వీఆర్వో సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

పెదపూడి: రైతులకు అందుబాటులో మెరుగైన సేవలు అందిస్తున్నామని కుమారప్రియం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ యార్లగడ్డ అమ్మన్న చౌదరి తెలిపారు. ఆయన బుధవారం గండ్రేడులో విలేకరులతో మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. తమ పీఏసీఎస్ ద్వారా ఇప్పటి వరకూ రైతులకు రూ.2.5 కోట్ల దీర్ఘకాలిక రుణాలు, రూ.3.5 కోట్ల క్రాప్ రుణాలు, రూ.64.45 లక్షల రైతు నేస్తం రుణాలు అందించామని వివరించారు. కొత్తగా మరో రూ.10 లక్షల రుణాలు రైతులకు అందించడానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. తమ పీఏసీఎస్‌కు ధాన్యం కొనుగోలు ద్వారా రూ.48 లక్షల కమిషన్ లభించిందన్నారు. సంఘ ఆడిట్ రిపోర్టు ప్రకారం మరో రూ.9.65 లక్షల లాభం వచ్చిందన్నారు. సీఈఓ నాగిశెట్టి బాలచక్రం పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి దేవుడి మాన్యంలోని వేగి అబ్రహం చర్చిలో మూడు రోజులుగా జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు బుధవారంతో ముగిశాయి. ఈ ప్రార్థనల్లో వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు వాక్య సందేశాన్నిచ్చారు. దేవుడి మాన్యంలోని క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్థానిక రాజుల కాలనీలోని గ్లోరీ పెంతుకోస్తు చర్చిలో జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు బుధవారంతో ముగిశాయి. రెవరెండ్ పాస్టర్ కె.నవీన్ పాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఘనంగా సాయిసత్య వ్రతాలు



బూరుగుపూడి బాబా ఆలయంలో వ్రతాలను ఆచరిస్తున్న దంపతులు

మధురపూడి: బూరుగుపూడి, కోరుకొండ గ్రామాల్లోని బాబా ఆలయాల్లో బుధవారం సాయి సత్య వ్రతాలు ఘనంగా జరిగాయి. బాబా 105వ సమాధి ఉత్సవాల్లో భాగంగా దంపతులు ఈ వ్రతాలు నిర్వహించారు. కోరుకొండ పెట్రోలు బంకు సమీపంలోని బాబా ఆలయం, గానుగవీధిలోని దేవాలయం, బూరుగుపూడి మెయిన్‌రోడ్డులోని ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు చేశారు.

హాస్పిటళ్లలో నిబంధనలు తప్పనిసరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో ప్రజారోగ్య సంరక్షణపై చట్టపరమైన ప్రభుత్వ విధివిధానాలను తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ డాక్టర్ మాధవీలత అన్నారు. వాటిలో ఏ విధమైన లోపాలున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆమె అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా స్థాయి సలహా మండలి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే తనిఖీలు నిర్వహించిన ఆసుపత్రులకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకున్నారో నివేదిక రూపంలో అందచేయాలని స్పష్టం చేశారు. జిల్లా వైద్యగణాంకాధికారి జె.కుమారస్వామి మాట్లాడుతూ జిల్లాలోని 73 హాస్పిటళ్లలో ఇప్పటికే కొన్ని హాస్పటళ్లు, ల్యాబ్‌లలో తనిఖీలు నిర్వహించామన్నారు. లోపాలు గుర్తించిన వాటికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని 428 హాస్పిటళ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ పి.లక్ష్మీ దేవి, జిల్లా కుష్ఠు, క్షయ, ఎయిడ్స్‌నియంత్రణ అధికారి డాక్టర్ వసుంధర, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ఐఎంఎస్ సెక్రటరీ డి.సతీష్, డీఆర్‌డీఏ పీడీ కె.వీణాదేవి, డిప్యూటీ జిల్లా గణాంక అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పెంటపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం



పెంటపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని పెంటపల్లిలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులు ఎవరైనా ఉంటే గుర్తించి పథకాలు అందిస్తామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తిరిగి పట్టం కట్టాలని కోరారు. అనంతరం గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, బీసీ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, మాజీ సర్పంచులు కర్రి అరుణకుమారి, తొట్టా సత్యనారాయణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి శివరామకృష్ణ, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, గండికోట రామకృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పాల్గొన్నారు.

దైవ నామస్మరణతో ఆనందమయ జీవితం



రంగంపేట సాయి మందిరంలో పూజలు చేస్తున్న దృశ్యం

రంగంపేట: నిరంతర దైవ నామస్మరణతో ఆనందమయ జీవితం పొందవచ్చని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వర్లు అన్నారు. ఇందుకోసమే సత్య సాయి భజనామృత కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా చేపట్టామని చెప్పారు. స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో నిర్వహించిన 11వ సత్యసాయి గానామృతం 9 గంటల భజన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామని, ఈ నెల 29న రాజమహేంద్రవరం ఆల్కాట్‌గార్డెన్స్ వద్ద ఉన్న సాయి మందిరంలో ముగింపు ఉంటుందన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర యువజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సత్య సాయి పాదుకలకు, చిత్ర పటాలకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సేవాదళ్ కన్వీనర్ బిక్కిన రామలక్ష్మి, జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్లను నిర్లక్ష్యం చేస్తే సహించం



సమావేశంలో పాల్గొన్న కొండబాబు

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించిన ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లలను నిర్లక్ష్యం చేసి, అవమాన పరిస్తే సహించేది లేదని గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్ బర్రె కొండబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపురం ఎదురుగా ఉన్న గౌతమీ జీవకారుణ్య సంఘ ఆశ్రమ ప్రాంగణంలో ఆయన అధ్యక్షతన బుధవారం సాయంత్రం అత్యవసర పాలకమండలి సమావేశం నిర్వహించారు. వంట మనిషిని ఉద్యోగం నుంచి తొలగించిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి నిర్ణయంపై చైర్మన్, డైరెక్టర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వంట మనిషి రాజీనామా లేఖకు ఈవో చెప్పిన విషయాలకు పొంతన లేదన్నారు. బోర్డుకు తెలియకుండా సిబ్బందిని తొలగించడం, ఇష్టం వచ్చినట్లు కొత్త వారిని నియమించడం వంటి సొంత నిర్ణయాలు అమలు చేసి, ట్రస్ట్ బోర్డ్ సభ్యులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం ప్రభుత్వం నియమించిన పాలకమండలిని అవమానించడమే అన్నారు. బడ్జెట్ కేటాయింపుల గురించి డైరెక్టర్లు అడిగే వరకు ఒక్కమాట కూడా తెలియనివ్వకపోవడం సరికాదన్నారు. సమావేశంలో డైరెక్టర్లు అడిగిన ఏ ప్రశ్నలకు సరైన జవాబు రాలేదని నిరాశ వ్యక్తం చేశారు.కారుణ్యానంద స్వామి నలుగురి పొట్టనింపేందుకే ఆశ్రమాన్ని స్థాపించారు కానీ, అకారణంగా పొట్ట కొట్టేందుకు కాదన్నారు. సిబ్బందికి ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఈవోకు సూచించారు. నలుగురు డైరెక్టర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి సంస్థలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలను, అకౌంట్ వివరాలను పరిశీలించడానికి నిర్ణయం చేశారు. సమావేశంలో బోర్డు డైరెక్టర్లు బత్తిన అన్నవరం, అడపా రఘు, నాగులాపల్లి దేవి లక్షణ రావు, తమ్మిశెట్టి రాధిక ప్రభాస్, పైడా ఉషా, చొల్లంగి ఏడుకొండలు, చిట్టాబత్తుల అనంత లక్ష్మీ రాజు, పిల్లి నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రాలో బాలికకు లడ్డూ



లడ్డూ పొందిన అమృత

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద దుర్గమ్మ తల్లి ఆలయంలో దసరా సందర్భంగా ఉంచిన పది కిలోల లడ్డూను డ్రాలో అందజేశారు. బుధవారం పడాల అమృత అనే బాలికకు ఈ లడ్డూ దక్కింది.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం భారీ అన్నసమారాధన జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ నిర్వహించిన ఈ కార్యక్రమానికి గాడాల, మధురపూడి, నిడిగట్ల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

రంగంపేట: మండలంలోని పలు అభివృద్ధి పనులను రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ మండల జేఈ కమ్మసత్తి శ్రీనివాసరావు బుధవారం ఇక్కడ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నల్లమిల్లి, సింగంపల్లి గ్రామాల్లో రూ.36 లక్షలు, రూ.40 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లు, పైపులైన్లను ప్రారంభిస్తారని చెప్పారు. మూడు గంటలకు దొడ్డిగుంట గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం



అమ్మవారిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామం వెలంపేట రామాలయం వద్ద ఉన్న అమ్మవారిని ఘనంగా బుధవారం నిమజ్జనం చేశారు. దేవీ నవరాత్రుల ముగింపులో భాగంగా అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తుల్యభాగ నదిలో నిమజ్జనం చేశారు. అలాగే శెట్టిబలిజ పేటలో అమ్మవారిని కూడా నిమజ్జనం చేశారు.

పేదల ఆరోగ్యమే సీఎం లక్ష్యం



శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

రంగంపేట: పేదలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని దొంతమూరు గ్రామంలో సర్పంచ్ గోలి రమణ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ షమీమ్‌కుమార్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ బి.అనూషా, డాక్టర్ ఎస్.ముఖేష్‌కుమార్ తదితరులు 562 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శి బి.గౌరీకాంతి పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం



వేమగిరి సెంటర్‌లో మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: రాజంపేట ఎంపీ, లోక్‌సభ పార్లమెంటరీనేత, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బుధవారం వేమగిరి సెంటర్‌లో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చందన మిథున్‌రెడ్డికి క్రేన్ సహాయంతో భారీ గజమాల వేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, పాలిక శ్రీను పాల్గొన్నారు.